# నివురుగప్పిన నిప్పు

సైనారి చిన్నప్ప



*తన కూతురుతో సమాన మన్నాడు. కూతురు కాలు జారిందన్నాడు. కాపులను కొట్టి గ్రద్దలకు వేయడం న్యాయమేనా? అన్నాడు. కాపాడ మన్నాడు. పెద్ద మనిషి. ఆతడొక 'నివురుగప్పిన ని'ప్పని ఆ అమాయకురాలికి చెప్పే వారెవరు?*

**వేసవి** కాలపు మండుటెండలా ఉధృతంగా కాసే ఎండకు పచ్చని పైరులు ఎండిపోతూంటే పల్లీయుల చల్లని గుండెలు బాధతో మండిపోసాగాయి. ఆకాశంకేసి ఆశతో చూశారు, ఎక్కడైనా అరచేతి పరిమాణం గల మబ్బుతునక అవుపిస్తుందేమోనని. వినీలంగా ఉండే ఆకాశం—పశ్చిమదిక్కున మేఘావృతమై ఉండటం కళ్లకు కనుపించగానే, కళావిహీనమైన రైతు బిడ్డల మొహాల్లో చీకటింట్లో వెలిగించిన జ్యోతిలా తళుక్కున మెరిసింది ఓ ఆశాకిరణం.

నిండు కుండల్లా ధాన్యంతో నింపుగా ఉండాల్సిన కణజాల్లో ధాన్యం నిండుకోగా, ఉన్న కాసిన్ని రాగుల్ని కొట్టులోనుంచి వెలుపలకు తీసి, 'రాగి అంబలి' కాచి, ఎండిపోయి బోసిగా ఉన్న చెర్లో-మండిపోయే గుండెలు గల బీదాబిక్కికిపోసి, వాన రావటానికి తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ నోరు, పొట్ట బాధతో బాదుకుంటే దేవుడికి కనికరం కలిగి వాన వస్తుందన్నాడు, ఊరి పెద్ద కాపు.

ఉల్లిపాయలు వేసి, కమ్మగా అంబలికాచి, పెద్దకాపు సలహా ప్రకారం చెర్లో బీదాబిక్కికి అంబలిపోస్తే, వారు నోరు, పొట్ట బాధతో బాదుకొని, వేసిన పొలికేకలు మిన్ను ముట్టాయో లేదో కాని—వారం రోజులు చూచినా వాన చినుకు నేలమీద రాలలేదు.

"వానాలు కురవాలి వానదేవుడా— వరిచేలు పండాలి వానదేవుడా; నల్ల నల్ల మేఘాలు వాన దేవుడా—జల్లుగా కురవాలి వానదేవుడా" అంటూ ప్రతిరోజూ బడిలో పిల్లలచేత పాడించిన పాట వానదేవుని చెవున పడిందోలేదోకాని—పసిపిల్లల నోరు నొవ్వటం మినహా భూదేవి మాత్రం తడి కాలేదు.

చెరువు కట్టమీది 'అమ్మ'వారి గుడి ముందు చలువ పందిరి వేసి, 'అమ్మ' వారికి ఆహార మిచ్చి ఆకలితీరిస్తే—మన ఆవేదన తీరుస్తుందనే ఆశతో రెండు బలిసిన పొట్టేళ్లను 'బలి' ఇవ్వగా- ఆ నిండు ప్రాణాల్లోనుంచి ఏకధారగా కారిన

వెచ్చటిరక్తంతో ఆ 'దేవి' ఆకలి దప్పులు తీరాయో లేదోకాని, ఆ పల్లీయుల ఈప్సితార్థం లేశ మాత్రమైనా ఈడేరలేదు.

ఊరిలోని జనమంతా నడివీధిలోచేరి, చదరపు గజం మేర అలికి, ముగ్గులు పెట్టి, నీళ్లతోనింపిన రెండు కొత్త కుండలు అలికినచోట పెట్టి, పూజచేసి, ఏడు దుక్కులు దున్నిన అచ్చం తెల్లటి గోమాతను అచ్చటికి తోలుకొనివచ్చి, కుండల సమీపాన నిలువబెట్టి, వానదేవుణ్ణి వరమడుగుతూంటే—మనుష్య ప్రయత్నంలేకుండా, నిండు కుండల్లో ఒక కుండైనా అప్రయత్నంగా గిర్రున తిరిగి—అందులో నుంచి కొంత జలం తొణికి నేలమీద చిందినా, లేక కుండల సమీపాన నిలువబడి ఉన్న గోమాత స్వస్థానం నుంచి నాలుగడుగులు ముందుకువెళ్లి 'పంచితాన్ని' పోసినా, భళ్లున తెల్లవారేసరికి చెరువులు, కుంటలు ఏకమై పోయేలా వర్షం వస్తుందనే ఆశతో అర్ధరాత్రి దాక ఎదురుచూచి 'కుండశకునం'తో విసిగినా, నీటితో ఉన్న రెండు కుండల్లో ఒకటైనా తనలోని నీటిని ఒకబొట్టైనా నేల మీద చిందించలేదు. నిలబడి, నిలబడి గోమాతకు కాళ్లు నొప్పి పుట్టగా నిలవబెట్టినచోటనే నెమరు

# నివురు గప్పిన నిప్పు

వేస్తూ పడుకుందేకాని, 'వాన వచ్చేయోగంఉంది' అనే ఆశను, నమ్మకాన్ని ఆ ప్రజల్లో కలిగించటానికి నిదర్శనంగా—నాలుగడుగులు ముందుకు వెళ్లనూ లేదు, 'పంచితాన్ని'గుమ్మరించనూలేదు. 'కుండ శకునం' నిష్ఫలమైపోగా నిరాశ, నిస్పృహలతో ఇళ్లకు వెళ్లిపోయారు వీధిలో మూగిన పల్లీయులు.

"నల్లని మేఘాలకు చల్లని గాలి సోకితే తెల్లటి బిందువుల రూపంతో నింగినుంచి నేల మీదికి ఏకధారగా కురుస్తుంది వర్షం" అంటూ బడిలో పిల్లలకు భూగోళపాఠం చెబుతూన్న మాస్టారి మాటలను వింటూ, రచ్చమీద కూర్చున్న పెద్ద కాపు ఆకాశంకేసి చూచి నిట్టూర్చాడు— "ఆకాశంలో మేఘాలైతే ఉన్నాయికాని ఇప్పుడు చల్లని గాలి వీసరటమే ప్రారంభమయితే, మాస్టారి భూగోళ పాఠంలోని బూటకం క్షణంలో బయటబడి తీరుతుంది" అని మనస్సులో అనుకుంటూ.

పెద్దకాపుగారు మనస్సులో అనుకున్న మాటల మరిచిపోక మునుపే నైఋతి దిక్కునుంచి గాలి వీసరటం ప్రారంభమైంది.

ఆకాశంకేసి చూచాడు పెద్ద కాపు. మాస్టారి భూగోళ పాఠంలోని మాటలు అక్షరాలా యథార్థ మన్నట్టు—రచ్చమీద కూర్చుని, వీధిలోకి జారవిడిచిన పెద్దకాపుగారి కాళ్లమీద రెండు వర్షపు బిందువులు పడేదాక— మాస్టారి మాటలను నమ్మలేదు పెద్దకాపు.

తుంపరతో ప్రారంభమైన వాన మెరుపుల ముద్దులతో, ఉరుముల కౌగిలిలో పరిపూర్ణమై ఏకధారగా పల్లెప్రజల హృదయాల్లో హర్షమై వర్షించి వెలిసింది. నిరాశతో నిస్తేజమై వాడిపోయిన పల్లెప్రజ ముఖపద్మాలు సంశోభితమయ్యాయి.

నీరులేక పైరు పెట్టగా మిగిలిపోయిన బీడు భూములను తడపటము, తడిపిన భూమిని దున్నటము, ఆకు తొక్కటము, పైరు నాటడము—నిమిషం నిలకడగా ఒకచోట నిలబడటానికి సమయం లేకపోతూంది పల్లెప్రజకు. రాత్రి, పగలనే విచక్షణ లేకుండా, ఒకరికంటే మరొకరు ముందుగా పైరు పెట్టటానికి తహతహలాడుతూ, 'అదునులో పైరు పెడితే వయసులోని పెళ్లి'లా అక్కరకు వస్తుంది కాబట్టి, 'నేను ముందంటే నేను ముంద'న్నట్లు త్వరపడుతున్నారు పల్లీయులు.

నిండుకుండలా నీటితో తొణికిసలాడుతూంది తుమ్మల చెరువు. ఆ చెరువుకు ఉత్తర కొసను శ్మశానవాటిక ఉంది. దక్షిణ కొసను— సుమారు మైలున్నర దూరంలో ఏదో పల్లెటూరుంది. తుమ్మల చెరువు కట్టమీద రాత్రి సమయాల్లో కొరివి దయ్యాలు కలిసి కోలాటం వేస్తూంటాయని ఆ పల్లీయుల్లో ప్రబలవిశ్వాసముంది. అందుకే చీకటి పడిందంటే తుమ్మల చెరువుకేసి ఒంటరిగా ఒక్క మనిషైనా వెళ్లడు, ఒక్క రామన్న మినహా.

రామన్నది ఆ ఊరు కాదు. ఎక్కడి నుంచి వచ్చి చేరాడో ఎవరికీ తెలియదు. గొడ్డూ గోదా లేకున్నా పెద్ద కాపుగారు అతన్ని ఎందుకు చేరదీశారో, చేరదీసినా ఆశ్రయ మిచ్చి, ఉండటానికి వేరే ఇల్లు ఇచ్చి, పాలేరుగా కాక పాలికాపుగా ఎందుకు ఉంచుకున్నారో ఎవరూ ఎరుగరాని, ఎవరికీ ఎరుకలేని విషయం.

రామన్నది కాయశరీరం. కోడెకారు వయసు. గుండును తిన్నా పండులా జీర్ణించుకొనే తత్వం. కండలు తిరిగిన శరీరం. పెల్లుబికి ముందుకు వచ్చినట్టున్న రొమ్ము. అతను 'సుంగు' విడిచి రుమాలు కడితే పాదుషాలా అపుపిస్తాడు. అతని మాటల తీరును చూస్తే చదువుకున్న 'దొరబాబు' గుర్తుకొస్తాడు. వేషం తీరును పరికిస్తే—కర్రలేని 'పల్లె పుల్లయ్య' లా సాక్షాత్కరిస్తాడు. రామన్న ఎంత చదువుకున్నాడో ఆ పల్లె ప్రజానీకానికి తెలియదు కాని, భారత, భాగవత, రామాయణాల్లోని ఏ సంఘటనల నైనా వివరించమంటే అతను ఇట్టే కంఠస్థంచేసిన విద్యార్థిలా అనర్గళంగా వివరించేయగలడు.

ఆ ఉదయం పైరు నాటటానికి కూలీలు



నంజన్‌గూడు ఔషధములకు ... ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము.

## రాంతీర్థ బ్రాహ్మి నూనె

(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు



చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెంపొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.

రాంతీర్థ హెయిరాయిల్ పెద్ద సీసా: రు. 4/50, చిన్నసీసా: 2/25.

యోగాసన చార్టు సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.

పోస్టేజితో ధర రు. 3/—లు మాత్రమే.

## శ్రీ రాంతీర్థ యోగాశ్రమం

దాదర్, బొంబాయి—14.

వస్తారు కాబట్టి మడి నిండా నీళ్లుండాలి. ఉదయాన్నే, తెల్లవారుజామున్లోనే వెళ్తే పారేది ఆలస్యమవుతుందని, అంతేకాకపగటిపూట తూము లేస్తే, ప్రక్కమడి రైతులు వచ్చేనీటిలో 'తీరవ' వేసుకుంటారు కాబట్టి 'ఇప్పుడే వెళ్లి తూముతీసి వస్తే తెల్లవారేసరికి మడినిండుగా నీళ్లుంటాయి' అని మనసులో అనుకొని, పార భుజానపెట్టుకొని, అన్నం తిని రాత్రి బయలుదేరాడు రామన్న, తుమ్మల చెరువుకేసి.

మొలబంటిలోతు నీళ్లలోకి దిగి తూము తీశాడు. గలగల మని ధ్వని చేసుకుంటూ తూమును ఒరుసుకుంటూ కాలువలోకి వచ్చి పడ్డాయి నీళ్లు. చెరువు గట్టెక్కాడు రామన్న. చలికి వణుకు పుట్టుకొస్తూంది. తేమ శరీరాన్ని పై పంచెతో తుడుచుకొని, చొక్కా వేసుకున్నాడు. చలి పోవటానికి చుట్టకోసం జేబు తడిమి చూచుకున్నాడు. ఆర్పి ఉంచిన చుట్ట ముక్క చేతి కందినది. చుట్ట ముక్కను పెదవుల మధ్య ఉంచుకొని, జేబులోని నిప్పుపెట్టెను తీసి చుట్ట ముట్టించుకున్నాడు. ఘాటుగా ఒక దమ్ము లాగాడో లేదో—''దభేల్'' మని ఏదో చెర్లోకి దూకినట్లు శబ్దమైంది. రామన్న ఎంత ధైర్యవంతుడు, నిబ్బరంగల మనిషైనా ఆకస్మికంగా కలిగిన ఆ శబ్దానికి అదిరిపడకుండా ఉండలేకపోయాడు.

''తుమ్మలచెరువుకాడికి ఎంత రేతిరికాడంటే అంత రేతిరికాడ పోవద్దు రామన్నా! దెయ్యాలుంటాయి'' అని పల్లీయులంటే, పరిహాసంగా నవ్వే రామన్నకు, ఆ శబ్దం విన్నాక అది దయ్యమే నేమో అన్పించింది. అందుకు తగ్గట్టు ఒకనాడు నారిగాడన్నమాటలు—''మడవ కట్టుకొద్దామని తుమ్మలచెరువు తూముకాడికి పోతే, పక్కనున్న మర్రిమాన్లోనుంచి 'దభేల్' మని నీళ్లలోకి దూకింది దెయ్యం''—రామన్నకు అప్పుడే జ్ఞాపకానికి వచ్చాయి. ఆ మాటలు జ్ఞప్తికి రాగానే రామన్న ఒళ్లు ఒక్కసారి 'ఝుల్ 'మంది. రామన్న గుండెను కుదటపరుచుకొని, జేబులోని నిప్పుపెట్టె తీసి, తిరిగీ ఒక పుల్ల వెలిగించాడు. ఒక్కసారిగా రామన్న గుండె ఆగినంత పనైంది.

పై పంచె, చొక్కా ఆత్రంగాతీసి, క్రింద పడేసి, నీటిలోకి దూకాడు రామన్న. నీటిపైన తేలుతూ, మునిగిపోతూన్న కేశరాశిని చేత్తో పట్టుకొని, కట్టకు సమీపంగా లాక్కొచ్చాడు రామన్న. స్పృహ తప్పిపోయిందేమోనని చేతుల్లోకి తీసుకోవటానికి ప్రయత్నిస్తూంటే—''ఛీ! విడిచిపెట్టు నన్ను!....చావాలనుకుంటూంటే ఇక్కడా దాపురించావా!''-అంది ఒక కంఠం. ఆ కంఠసర్వంలో తీవ్రత ఉన్నా, అందులో మిళితమై ఉన్న మార్దవాన్నిబట్టి ఆ కంఠం ఒక అతివ కంఠం అనుకున్నాడు రామన్న. అంతేకాదు. ఆ కంఠస్వరం, తనకు పరిచయమైనట్టిదిగాను, ఆ కంఠస్వరాన్ని తనెక్కడో విన్నట్టుగాను ఊహించాడు రామన్న.

''చాల్లే! కట్టెక్కు ముందు, తర్వాత చావ



శాశ్వతమైన అనుబంధం ఫోటో—ఎ. సంపత్‌కృష్ణ (మద్రాసు-1)

వచ్చుకాని!'' అన్నాడు రామన్న. ఆ కంఠస్వరాన్ని ఇట్టే కనిపెట్టేసి,''ఎవరు?....నువ్వా రాముా!'' అంది—ఆ అతివ కంఠం.

''ఔను!.... నేనే ! ! ... మరి నువ్వు...''

''నేను రాముా, గౌరిని'' అంది ఆ కంఠం—చెరువు గట్టెక్కుతూ.

''గౌరీ!'' ఆశ్చర్యంగా అన్నాడు రామన్న—ఆమె వెనుకగా కట్టెక్కుతూ.

''తర్వాత ఆశ్చర్యపోదువుకాని, ముందీ చలి పోగొట్టు—ఏదైనా ఉపాయంచేసి'' అంది గౌరి, కట్టమీద నిలిచి చలికి వణుకుతూ.

చెరువు కట్టమీదున్న తుమ్మ కొమ్మలను గొల్లలు మేకలకు మేతగా కోసివేయుగా, ఎండిపోయిన కంపలను ఏరి మంటవేశాడు రామన్న. ఒక్కసారిగా ప్రజ్వరిల్లిన మంట వెలుతుర్లో—తడిసిన గుడ్డలు బిగుతుగా గౌరి శరీరానికి అతుక్కుపోయి ఉండగా, ఆ తేమగుడ్డల్లోనుంచి తొంగిచూచే శరీరావయవ వంపుసొంపులు అందాన్ని ప్రతిఫలిస్తూ, గౌరికి సిగ్గును, రామన్నకు ఆనందాన్ని కలిగించాయి, ఒక్కక్షణం. మండేమంట వెలుతురుమీద పడకుండా దూరంగా జరిగి ''ఆ పంచె ఇలా ఇవ్వు!'' అంది గౌరి చేయి చాస్తూ. పై పంచెను ఆమెమీదికి విసిరాడు రామన్న. పంచెను తీసుకుని తుమ్మమాని మరుగుకు వెళ్లి, పంచెకట్టుకొని—చీర, రవికను విప్పి, నీళ్లు పిండివేసి, మంట దగ్గరకు వచ్చి కూచుంది గౌరి.

మోకాళ్లకు దిగువదాకా మాత్రమే ఉన్న పంచె అంచు జీరగా గౌరి కుడిపాదాన్ని ముద్దుపెట్టుకుంటూంది. భుజాలదాక మాత్రమే ఆచ్ఛాదనచేస్తూ, ఒక పంచె చెరగు ఎడమభుజం మీదమంచి తొంగిచూచి గౌరి వక్షోపరిభాగాన్ని చుంబిస్తూంది. నగ్నంగా ఉన్న మోకాళ్ల క్రింది భాగాన్ని, భుజందాక నగ్నంగా ఉన్న చేతులను, అమాయకంగా ఉన్న మొహాన్ని, తడిసిన కేశరాశిని వెలుతురు స్పర్శిస్తూంది.

తడిసిన కురులను ఆర్చుకోవటానికి చేతులను పైకెత్తినపుడు కప్పుకున్న పైట తొలగి, యౌవనశోభను బహిర్గతంచేస్తూంది. ఆ అవయవాల పొందికను, ఆ మిసిమి యౌవనాన్ని చూస్తూన్నప్పుడు గౌరి కదిలితే, ఒళ్లు విరుచుకొనే విరహిణి సౌందర్యాతిశయం ప్రస్ఫుటంగా కన్పిస్తూంది రామన్నకు—గౌరిలో. ఆ సౌందర్యాతిశయాన్ని చూస్తూ అడిగాడు రామన్న-''ఎందుకు చేశావింత తెగింపు?''—అని.

''మగాణ్ణి నమ్ముకున్న ఆడదాని గతి ఇంతకంటే మెరుగ్గా ఉంటుందా?—పెద్దరెడ్డోళ్లింటిలో పాలికాపుగా వచ్చి చేరిన నీకు మనసిచ్చింది నా తప్పా?—రెడ్డోళ్లబ్బాయి రంగడు నాకోసం తహతహలాడుతూ నీకు పోటీగా నిలబడితే, బెదిరి, ఊరు విడిచి, పారిపొమ్మని నీతో అన్నానా? రంగడంటే నాకసహ్యమని, నేను నీలాగ ఎక్కువగా భారత భాగవతాలు చదవకున్నా, వీధి బడిలోనైనా కొంతవరకు చదువుకున్నానని; నాకూ కాస్త పరిజ్ఞాన ముందని నువ్వు తెలుసుకోక పోవటం నా పొరపాటా—?

''నిన్నే నమ్ముకున్న నాతో మాటైనా చెప్పకుండా రాత్రికి రాత్రే ఊరువిడిచి వచ్చేశావే!

# నివురు గప్పిన నిప్పు

నీతల మీద ఏంపడి ముంచుకొచ్చిందని? ఏం తప్పు చేశావని? నమ్ముకున్ననువ్విలా చేయటం నా దుర దృష్ట మనుకుంటే, అమ్మ దైవదర్శనానికి వెళ్లిపోయింది. అది నా ఖర్మ అనుకున్నాను. ఏది ఏమనుకున్నా వయస్సొచ్చిన ఆడపిల్ల ఒంటరిగా ఊళ్లో ఉండటం ఎంత కష్టమో నీకు తెలియనిది కాదు. అతని ఆటలకు అడ్డుగాఉన్న నువ్వు ఊరు విడిచి వచ్చేశాక రంగని ఆగడాలు హద్దు మీరాయి.

"రంగడు రాత్రి నాతోమాట్లాడటానికి వస్తు న్నట్లు, అతని కోరికతీర్చకపోతే పగబూనిన నాగులా కాటువేయటానికి పథకం తయారుచేసి ఉంచి నట్లు, వాళ్ల పాలేరు వెంకడు కబురు తెచ్చాడు.

"చావడిదగ్గర పురాణ కాలక్షేపమంటే పిన్నా పెద్దా అందరూ అక్కడకు వెళ్లిపోయారు. నాకు ఇంట్లో ఉండటానికీ, చావడి సమీపానికి వెళ్ల టానికీ భయంగానే ఉంది. ఎలాచేయటం? ఇంట్లోనుంచి బయలుదేరాను—చావడి దగ్గరికే పోదామని. కాని అనుకోకనే ఇక్కడకొచ్చేశాను. ఇక్కడ దయ్యాలు తిరుగుతుంటాయని అనుకుం టుంటే విన్నాను కానీ నాకేమీ భయం కలుగలేదు. ఇక్కడకూరంగడెక్కడ వస్తాడోననేభయం మినహా నాకు మరో ఆలోచనే లేదు. ఇక్కడికొచ్చి తుమ్మచెట్టు మరుగున కూర్చున్నాను. ఏవేవో ఆలోచనలు సుళ్లు తిరుగుతూంటే ఆలోచిస్తూ ఉండిపోయాను. కడకు నువ్వు తూము తీసే దాక, నేనీ లోకాన లేను. గల గలమని నీళ్ల శబ్ద మైతే రంగడొచ్చేసినట్టయింది. నీటిలోకి దూకేశాను. రంగడే నా మానాన్ని దోచుకోవ టానికి నా ప్రాణాన్ని రక్షిస్తున్నాడనుకున్నాను, నీళ్లల్లోనుంచి నువ్వు నన్ను కాపాడుతూంటే..."

అంతా విని నిట్టూర్చాడు రామన్న. కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"నువ్వెలా బ్రతుకుతున్నా విక్కడ ? "

"ఎలా బ్రతుకుతాను?—అక్కడి నుంచివచ్చి ఈ ఊరు చేరాను. ఊరి పెద్దకాపు ఆశ్రయ మిచ్చాడు. ఉండటానికి ఒక ఇల్లు ఇచ్చి, తనతోనే పాలికాపుగా పెట్టుకున్నాడు. అన్నమువగానే 'అంత' తెచ్చి నా ఇంట్లో పెట్టిపోతుంది పెద్ద కాపు చిన్న కూతురు సరోజ. ఆ అన్నాన్ని తినటం, పనిచేయటం — ఇట్లాగా బ్రతుకు తున్నా!"

కొంతసేపు నిశ్శబ్దం రాజ్య మేలింది.

"ఇంటికి వెళ్దాంలే!" అన్నాడు రామన్న పైకిలేస్తూ.

తడిచీరను చేతిలోకి తీసుకుని మౌనంగా లేచింది గౌరి. ఉదయమవటానికింకా సమయ ముంది. మసగ్గా ముసురుకున్న చీకటి తెరలింకా *తొలగింపబడలేదు.*

తడి చీరను దండెంమీద ఆరవేసి రామన్న ఇచ్చిన ఈతచాపమీద లోపల పడుకుంది గౌరి. గోనెపట్టనొకదాన్ని పంచలో అరుగుమీద పరచు కొని పడుకున్నాడు రామన్న.

తెల్లవారింది. రామన్న లేచి పెద్దకాపుగారి ఇంటికేసివెళ్లి, ఒక గంట తర్వాత వచ్చాడు, ఒంటరిగా కాదు — వెంట ఒకఅమ్మాయి నుంచుకొని!

ఫాలభాగాన చందమామంత వెడల్పు కుంకుమ బొట్టు,చెవులకుఎర్రటిఏడురాళ్లకమ్మలు,నున్నగా దువ్వి ముడివేసుకున్న కొప్పులో చేమంతిపూలు, ఎర్రటి శరీరానికి అందంగా అమరిన తెల్లటి చుక్కల చీర, అమాయకత్వం ఉట్టిపడేలా ఉన్న అందమైన కోల మొహము, కోటేరు లాంటి నాసిక, పసిపాప నిర్మలమైన నవ్వులా మేఘాలు లేని పున్నమి నాటి నిష్కల్మషమైన జాబిల్లిలా పెదవులపై నిశ్చలమైన చిరునవ్వు నవ్వుతూన్న ఆ పల్లెపడుచును చూచి 'ఎవరీ అందాలరాశి' అన్నట్టు వెరగుపడి చూచిందిగౌరి—ఆమెకేసి.

"పెద్దకాపుగారి కూతురు, సరోజ—ఈమె" అన్నాడు రామన్న, గౌరితో.

ఆ మాటలకు సిగ్గుపడుతూ రామన్నను ఓర గంటితోచూచి—చిన్నగా నవ్వింది సరోజ. ఆ నవ్వును చూస్తూన్న గౌరి మానసాకాశంలో ఒక మబ్బు తునక తొంగి చూచింది.

"పైరు నాటడానికి కూలోళ్లు వెళ్తున్నారు. నేనూ పోతున్నా" అంటూ గౌరికేసి చూశాడు రామన్న. ఆమె అంగీకారంగా తలూపింది. వెళ్లి పోయాడు రామన్న.

గౌరి పరిచిన ఈతచాపమీద కూర్చుంది సరోజ. పెద్ద కాపుగారి కుమార్తె అని వినటం తోనే సరోజమీద ఒక గౌరవ భావాన్ని ఏర్పరచు కుంది గౌరి. అందుకే కూర్చోవటానికి చాప పరిచింది.

చాపమీద కూర్చుని 'రామ్మామ ఇలాంటి వాడు, అలాంటివాడు— అంతమంచివాడిక ప్రపం చంలో లేడన్నట్టు పొగుడుతూ ఏ. చెప్పింది సరోజ. ఆ మాటలతో గౌరి సంతోషించటానికి బదులు, తన మానసాకాశాన్ని మరింత మేఘా వృతం చేసుకుంది. ఇంతలో "సరోజక్కా"

(తరువాయి 49 వ పేజీలో)


## డాక్టర్ వృత్తి చేయండి!

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు పోసల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదు వుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొం దండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

**INDIAN HOMOEOPATHICCOLLEGE (A.W.P.) JULLUNDUR CITY**

## సినిమానటులు

మీరు సినీకారులుగాచేరి, నెలకు మంచివరుమానం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

**BOMBAY FILM SERVICE, (W.A.P.) PHAGWARA (N.R.)**



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంప బడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయ బడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**

# నివురు గప్పిన నిప్పు

(12వ పేజీ తరువాయి)

అంటూ పరికిణీ కట్టుకున్న ఓ పదేళ్లమ్మాయి లోపలికి వచ్చింది.

"ఏం పద్మా?" అంది సరోజ.

"అయ్యగారు రమ్మంటున్నారు" అందా అమ్మాయి తలవంచుకొని.

"మీ చెల్లెలా?" అంది గౌరి—ఆ అమ్మాయి కేసి చూస్తూ.

"కాదు. మా పాలేరు కోటయ్య కూతురు. ఇక్కడే వీధిబడిలో ఆయిదో వాచకం చదువుతూంది! మా నాన్నగారు పిలుస్తున్నారట. వెళ్లొస్తా" అంటూ లేచి వెళ్లిపోయింది సరోజ.

* * *

పొలం దగ్గర్నుంచి నవ్వుతూ వచ్చి గౌరిని పలుకరించే రామన్న ఆ రోజు మౌనంగా ఇంటికొచ్చాడు. నెత్తిమీదున్న రుమాలును విప్పి వట్టెంట్లో వేసి కూర్చున్నాడు. గౌరి నూనెదీపం ముట్టించి, చెంబుతో నీళ్లతెచ్చి రామన్న ముందుంచింది, కాళ్లు కడుక్కోవటానికి. రామన్న పరధ్యానంగా అలాగే కూర్చుని ఉంటే గౌరి పలుకరించింది.

"ఎందుకలా ఉన్నావ్?"

"ఎలా ఉన్నాను?"

"కోపంగా!..."

"కోపం!... ఛీ బుద్ధిలేని లోకం!... గడ్డి కరిచే గుడ్డిలోకం!"

"ఇంతకూ ఏం జరిగిందో చెప్పకనే ఎందుకా కోపం?"

"ఏం జరుగుతుంది? బాగా బుద్ధొచ్చేలా నాలుగంటించాను."

"ఎవర్ని?"

"వాణ్నే! కరణంగాడి కుడిభుజం, కాటిగాణ్ని."

"ఎందుకు?"

"ఎందుకా? బుద్ధిలేకుండా నోటికొచ్చిందల్లా వాగినందుకు! ఆ ఊళ్లోనుంచి నిన్ను లేవదీసుకొచ్చేశానట! అంతేకాదు. పెద్దకాపు చిన్న కూతురు మీద కన్నేసుంచానట! దెబ్బచూచి వాడి మిడిసిపాటంటూను? పెద్దకాపుకు, కరణానికి కాకపోతే మధ్య వీడొచ్చి నన్ను నానామాటలంటాడా, బుద్ధిలేని వెధవ!" అన్నాడు రామన్న కోపంగా. ఆ మాట విని, రామన్న కోపాన్ని చూస్తూ గట్టిగా నవ్వేసింది గౌరి.

"ఎందుకట్లా నవ్వుతావ్?"

"నవ్వక ఏడవ మంటావా? అదికాదు. వాళ్లనే మాటల్లో, లేక అనుకొనే మాటల్లో తప్పేముంది?" అంది గౌరి—రామన్నను ఆదోలా చూస్తూ.

"అంటే....?"

"అంటే ఏముంది—? ... ఆ ఒక్క 'కార్యం' కాకుండా, పెళ్లికానివారు ఒక ఇంట్లో ఎన్నాళ్లైనా ఉంటే ఏమైనా అనుకుంటారు, ఎన్నైనా అనుకుంటారు! అట్లా అనుకోకుండా ఉండాలంటే..."

"ఉండాలంటే...?!"

"ఆ మూడుముళ్లూ వేసెయ్యాలి." సిగ్గుతో తలవంచుకొంది గౌరి.

"ఔను! ఆ మూడు ముళ్లూ వేసెయ్యాలి! వేసేస్తాను కూడా! ఇప్పుడే వెళ్లి పెద్దకాపుతో మాట్లాడి వస్తా" అంటూ లేచిపోయాడు రామన్న.

పడుకుండే సమయానికి తిరిగొచ్చి చెప్పాడు. "పెళ్లిక్కావలసినవన్నీ పెద్దకాపు కొనిస్తానన్నాడు. సోమవారం నాడు అతనివెంట పుంగనూరికి పోవాలి."

ఆ మాట విని తనప్పుడే పెళ్లికూతు రయినట్టు సిగ్గుపడింది గౌరి. ఆ మరునాడే సోమవారం. రెండు గంటలకల్లా అన్ని పనులూ ముగించుకొని వచ్చాడు రామన్న.

"పెద్ద కాపు 'సైకిల్‌మీద వస్తాను, నువ్వు పద రామన్నా' అన్నాడు. నేను నడిచిపోతాంటే, అతనొచ్చి కలుసుకుంటాడులే. నే వెళ్లొస్తా" అన్నాడు రామన్న గౌరితో.

"అలాగే" అంటూ తలూపింది గౌరి.

వెళ్లిపోయాడు రామన్న.

రామన్న వెళ్లిపోయిన తర్వాత కాస్సేపుదాకా ఏదో ఆలోచిస్తూండి, పొరకతో ఇల్లు ఊడుస్తూండగా పద్మ లోపలికొచ్చింది.

"ఏం పద్మా! బడికి వెళ్లలేదా?" అంది గౌరి.

"లేదక్కయ్యా. మధ్యాహ్నం బడి రెండున్నరకు... అందుకని...." పద్మ మాట పూర్తి చేయక మునుపే—పెద్దకాపు లోపలికొచ్చాడు. అతన్ని చూచి పద్మ బయటికివచ్చి పంచలో నిలబడింది.

లోపలికొచ్చిన పెద్దకాపును, అతని బుర్ర మీసాలను, చింతనిప్పుల్లాంటి ఎర్రటి కళ్లను, ఘటోత్కచునిలాంటి అతని ఆకారాన్ని చూశాక అతనిపై బలవంతంగా సదభిప్రాయాన్ని కలిగించుకుందామనుకున్నా సాధ్యం కాలేదు. ఆ కళ్లు క్రౌర్యానికి నిలయాలేమో అనిపించటంతో, అత నే అఘాయిత్యానికి ఒడిగట్టుతాడో అనే భయం పట్టుకొంది. డేగను చూచి భయపడే పావురంలా గౌరి బెదరు చూపులు చూస్తూంటే "నీతో మాట్లాడే పనుండి వచ్చానమ్మా" అన్నాడు పెద్దకాపు. ఆకారాన్ని చూచి, ముఖ వర్చస్సును బట్టే మనిషి స్వభావాన్ని మనం ఊహించే విషయాలు ఒక్కొక్కప్పుడు వ్యతిరేకంగా ఉంటాయి. అందుకే ఆకారాన్ని చూచి పెద్దకాపు క్రూరుడని భయపడిన గౌరి, మృదువైన అతని మాటలను బట్టే, పెద్దకాపు తనూహించినంత క్రూరుడు కాడనితెలుసుకుంది. ఈతచాప పరిచి "కూర్చోండి" అంది గౌరి. చాపమీద కూర్చున్నాడు పెద్దకాపు.

"నీ కెలా నా మనసులోని మాటలను చెప్పాలో అర్థం కాలేదమ్మా! సరోజ తల్లిలేని పిల్ల... అమాయకురాలు. దానికి


## నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడనవసరంలేదు. ఈవ్యాధి నిర్మూలనకుగాను 30 సం.ల పరిశోధనా ఫలితముగా లభ్యపరచుకొనబడి పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదవుషధం. ఎంత మొండివ్యాధికైనను తక్షణమే బాధ నివారింపజేయుటయే గాక కొంత కాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 ఔ. సీసా రు. 3—75. పోస్టేజి ప్రత్యేకము

ఇండియన్ మెడిసన్‌హౌస్,
విజయవాడ—2.

## నారసింహ లేహ్యం

బంగారు చేరినది. మేహము, నిక్కాక, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.

20 తు డబ్బీ రు. 3-8-0.

## రోజాపుష్ప లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు.1-4-0; పోస్టేజి రు.1-1-0. మా క్యాటలాగు, కాలెండరు ఉచితం. పి. సి. ఏ. అండ్‌కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.




దొంగలనుండి, క్రూరమృగములనుండి మిమ్ము రక్షించుకోండి. వనభోజనములు, యాత్రలు, నాటకములకు చాలా ఉపయోగమైనది. ఆటోమేటిక్ ఆరు తూటాలుగలది. తేలికైనది. దీని పెద్దశబ్దము, ప్రకాశమైన మంట మిమ్ము ఆపదలనుండి రక్షించును.

| | | | |
|---|---|---|---|
| నెం. | 333 | 444 | 555 |
| ధర రు. | 6 | 8 | 13 |

25 తూటాలు ఉచితం: ఆపైన ప్రతి 100 తూటాలు రు. 3. లెదరు కేసు రు. 4. పోస్టేజి రు. 2. లైసెన్సు అనవసరం. ఒకే ప్యాకింగులో రెండు రివాల్వర్లు తెప్పించుకున్న పోస్టేజి, ప్యాకింగు ఉచితం.

BHARAT COMMERCIAL STORES
(APW) JULLUNDUR CITY.




చలవచేసి
హాయి నిచ్చును

ఈ పరిమళ ఆయుర్వేద హేర్ ఆయిల్ (తలనూనె) – బెంగాల్ కెమికల్స్‌వారి పెర్‌ఫ్యూండ్ బ్రాహ్మి హేర్ ఆయిల్. శిరోజములు ఒత్తుగా పెరుగును. మెదడుకు చలవచేసి నరాలకు హాయి నిచ్చును. దీనిని నిత్యమూవాడిన మెదడుకు అలసట వుండదు. హాయిగా నిద్రపట్టును. ఎక్కువ మానసిక ప్రయాస, శ్రమగలవారికి ఎంతో మంచిది.




బెంగాల్ కెమికల్ వారి వస్తువు

NATIONAL-CAL-B-40T6


# నివురు గప్పిన నిప్పు

లోకమంటే ఏమిటో తెలియదు తల్లీ! నాకు నువ్వంటే ఒకటికాదు, సరోజంటే ఒకటికాదు. ఇద్దరూ నా కొకటే... ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో...'' కొంతసేపు మాటలకోసం తడువుకున్నాడు పెద్దకాపు. "ఒక రహస్యం చెబుతా... గుట్టుగా ఒక సహాయం చేయగలవా తల్లీ!'' బతిమాలుతూన్నట్టు, గౌరికేసి దీనంగాచూస్తూ అడిగాడు పెద్దకాపు.

అంత పెద్ద మనిషి అలా 'ఇదౌ'తూంటే గౌరి మనసులో నొచ్చుకుంది.

"ఏమిటో చెప్పండి, నా చేతనైనంతవరకు సాయం చేస్తాను.''

కొంతసేపు తటపటాయించాడు పెద్దకాపు. తుదకు బాధగా చెప్పాడు: "సరోజ—కాదు, నీ చెల్లెలు కాలుజారిందమ్మా.'' ఆ మాట విని హడిపోయింది గౌరి. అర్థం కానట్లు అంది: "అంటే...!''

"సరోజ కడుపులోపాపపెరుగుతూందమ్మా'' ఆవేదనగా అన్నాడు పెద్దకాపు. ఆశ్చర్యపోయింది గౌరి. కొంతసేపటికి పెద్దకాపే అన్నాడు: "ఆ విషయమైనా — నాకు రాత్రే తెలిసిందమ్మా!''

"ఆ పాపకు తండ్రెవరో సరోజనడిగి తెలుసుకోమంటారా?''

"ఆ విషయం రాత్రే సరోజ నాతోచెప్పింది.''

"ఎవరు?'' ఆత్రుతగా అడిగింది గౌరి.

"రామన్న!'' అన్నాడు పెద్దకాపు బాధగా.

ఆ మాట వినగానే గౌరి తలమీద పిడుగు పడ్డట్టయింది. హతాశురాలై చలించిపోయింది. గౌరిలో దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది, పెను తుఫాను రోజునాటి సముద్ర కెరటాల్లా.

"ఐతే...ఇప్పుడు...నన్నేం చేయమంటారు?'' కళ్లనీళ్ళు తుడుచుకుంటూ అడిగింది గౌరి.

"నేను చెప్పాలా, తల్లీ, నీకు? నీకు తెలియందేముంది చెప్పటానికి? నీ కెలా తోస్తే అలాచెయ్. నిన్ను పెళ్ళాడుతానని, కావలసినవి కొనిమ్మని అడగటానికి రామన్న నాయింటికి వచ్చాడు రాత్రి. అంతవరకు ఆ మాట నాతో చెప్పని సరోజ— ఇక మౌనంగా ఉంటే సమయం మించిపోతుందని అంతా చెప్పేసిందినాతో. పెళ్ళాడుతానని ఆశచూపి, ఆ పాడుపని చేశాడట. సరోజ కడుపులో పాప పెరుగుతూందనే మాట వినగా, సరోజనే పెళ్లి చేసుకోమని, అన్ని ఖర్చులూ నేనే భరించి వైభవంగా పెళ్లి చేస్తానని, నా అనంతరం ఆస్తంతా నీపేర రాయిస్తానని చెప్పాను. వినలేదమ్మా, రాముడు. నీకు అన్యాయం చేయలేనంటాడు. అతని మొండిపట్టును చూచి, పెళ్లికావలసినవన్నీ కొనిస్తానని ఒప్పుకోక తప్పలేదు తల్లీ! కాని ఒక వైపు నీకుఅన్యాయంచేయవంటూమరోవైపు సరోజకు అన్యాయం చేయటం న్యాయమేనా?

చెప్పమ్మా? కాకులను కొట్టి గ్రద్దలకు వేయుటమేనా న్యాయమంటే?— అమాయకురాలైన నా కూతురికి మాయమాటలు చెప్పి, మోసం చేసి—నా కడుపులో చిచ్చు పెట్టటమేనా న్యాయమంటే?'' పెద్దకాపు కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. ఆయన కంఠం రుద్ధమై పోయింది. గౌరికూడా అతని కన్నీళ్లను చూచి ఏడ్చేసింది.

''మీరు బాధపడకండి!... నా వలన సరోజ జీవితం చక్కబడేలాఉంటే నేను ఏ సహాయం కావాలన్నా చేస్తాను'' అంది గౌరి నిశ్చలంగా. పెద్దకాపు కన్నీళ్లను తుడుచుకొని గౌరి కళ్లల్లోకి మౌనంగా చూశాడు.

''చెప్పండి, ఏం చెయ్యాలో?''

''ఫలానా అని నేను చెప్పలేనమ్మా. ఉన్న విషయాలన్నీ నీతో చెప్పాను; నీ ఇష్టం వచ్చినట్టు చేయి. రామన్న పుంగనూర్లో నాకోసం ఎదురుచూస్తూంటాడు. వెళ్లొస్తా'' అంటూ లేచిపోయాడు పెద్దకాపు.

పెద్దకాపు ఇంట్లోనుంచి బయటకు రాక మునుపే—ఠంగ్, ఠంగ్ మని మ్రోగిన బడిగంటను విని పరుగెత్తిపోయింది పద్మ.

పెద్దకాపు వెళ్లిపోయాక యోచిస్తూ ఈత చాపమీద కూర్చుంది గౌరి. ఆమె ఆలోచనలు పరిపరి విధాలుగా పొయ్యాయి. రామన్న మీద ఆమె కెంత నమ్మకమున్నా, పెద్దకాపు చెప్పిన మాటలను పూర్తిగా విశ్వసించింది. అసలు రామన్న సరోజను పిల్చుకొచ్చి, ''పెద్దకాపుగారి కూతురు సరోజ ఈమే'' అని పరిచయం చేసినప్పుడు, ఆ మాటకు ఆ అమ్మాయి సిగ్గుపడి నవ్వినప్పుడే- ఇద్దరికీ ఏదో ఉందనుకుంది గౌరి. ఆ విషయాన్నే ప్రత్యక్షంగా పెద్దకాపు నోటివెంట వినినప్పుడు బావురుమని ఏడ్వలేకపోయిందికాని, అతను వెళ్లిపోగానే ఈత చాపమీద పడుకొని కుమిలి కుమిలి ఏడ్చింది. తను ఎవరిని నమ్మిందో ఆ ఆధారము నిరాధారమైనట్టు, తన కిక మిగిలింది 'ఒకేదారి' అన్నట్టు విలపించింది.


సాయంత్రం 5 గంటలకు బడినుంచి వచ్చింది పద్మ. పుస్తకాలు ఇంట్లో పెట్టి గౌరి అక్కయ్యను చూద్దామని చక్కా వచ్చింది. పంచలోకి వచ్చేసరికి లోపలినుంచి మాటలు వినవచ్చాయి. ఆ మాటలు వింటూ పంచలోనే నిలబడింది పద్మ.

''నాన్నగారు చెప్పిన మాటలన్నీ నిజమేనా సరోజా—?''

''నిజమే అక్కా. నువ్వు రాకముందు రామ్మామ నన్ను పూల్లో పెట్టి పూజచేసేవాడు. నువ్వు వచ్చాక నా వైపు కన్నెత్తి చూడటం కూడా మానేశాడు.'' కళ్లనిండా నీళ్లు పెట్టుకుంది సరోజ.

''ఊరుకో చెల్లీ!'' అంది గౌరి.

''అదికాదక్కా! ఈ రోజు గడిస్తే, కాదు—పుంగనూరుకు వెళ్లిన రామ్మామ వచ్చేస్తే—మానం పోయిన నా ప్రాణం గంగపాలు కావాల్సిందే కదూ!'' అంటూ బావురుమని ఏడ్చింది సరోజ.



అలంకరణ — చిత్రం—కె. భాంసురీ (మద్రాసు-34)

''భయపడకమ్మా. నీ మానమూ, ప్రాణమూ రెండూ నిలుస్తాయి. రామ్మామకు నీకూ— రామ్మామ తెచ్చే పెళ్లి సరంజామాతోనే పెళ్లవుతుంది. ఇంక నన్నేమీ అడక్కు. నిశ్చింతగా వెళ్లిపో...'' గౌరి కంఠం బొంగురుపోయింది.

బయటికొచ్చిన సరోజ కంటికి కనుపించకుండా పంచలో ఉన్న పద్మ వెళ్లిపోయింది.

మును మాపటివేళ భుజంమీద పెద్దమూట పెట్టుకొని పుంగనూరునుంచి వచ్చిన రామన్న సంబరంగా ఇంట్లోకి పోయాడు. వెలుగులేక, వెలుగు ముట్టించేవారు లేక వెలవెలబోతూ, బోసిగా బావురుమని ఏడుస్తూంది ఇల్లు. భుజం మీద మూటను ఆత్రుతగా మూల్లో పారవేసి, కోటయ్య ఇంటి దగ్గరకు వెళ్లిందేమో నని కోటయ్య ఇంటికేసి వెళ్లాడు. కోటయ్య పొలంనుంచి ఇంకా రాలేదు. గోడనానుకుని పద్మ ఏడుస్తూంది.

''పద్మా! మీ అక్క రాలేదా?'' అన్నాడు రామన్న.

''లేదు... నేను వద్దని ఎంత చెప్పినా వినకుండా తుమ్మల చెరువుకేసి వెళ్లింది'' అని పద్మ తాను విన్నదంతా రామన్నతో చెప్పేసింది.

తుమ్మల చెరువుకేసి పరుగు లంఘించుకున్నాడు రామన్న. కట్టెక్కి చెరువులోకి దూకబోతూన్న గౌరి హస్తాన్ని గట్టిగా పట్టుకున్నాడు వెనుక వైపునుంచి. వెనుదిరిగి చూచింది గౌరి. ఏడ్చి, ఏడ్చి మొఖం వాచి, కందిపోయింది. ఆమె కళ్లు ఎర్రగా తడిగా ఉన్నాయి. కోపంగా అంది: ''విడిచి పెట్టు నన్ను. నివురు గప్పిన నిప్పువు నువ్వు! అటు సరోజ జీవితానికి చిచ్చుపెట్టి, ఇటు నాకు ఒట్టి ఆశలు కల్పించి, నన్ను రక్షించటానికి వచ్చావా?... వెళ్లు. ఇటు నా ఒక్క ప్రాణమే పోతుంది. అటు, ఆ అమాయకురాలి మానమూ ప్రాణమూ రెండూ పోతాయి నేను బ్రతికితే. వెళ్లిపో.''

''గౌరీ!'' బాధగా అరిచాడు రామన్న.

''నివురుగప్పిన నిప్పు నేనా? నిర్మలమైన నీ మానసాకాశంలో మబ్బులు లేపి, నవనీతంలాంటి నీ మనసును మాయ మాటలచే కరిగించి, తన కూతురును నాకు కట్టబెట్టాలని చూచే 'మెత్తటి మాటల పెద్ద మనిషి' పెద్దకాపోక నివురుగప్పిన నిప్పు! అందుకే ఆ ఊరు విడిచి ఈ ఊ రొస్తే అంత ఆదరణ ఒలకబోసి ఆశ్రయమిచ్చాడు కాబోలు! నా మీద పిచ్చి వ్యామోహంతో, కొండంత అపనిందను మీదవేసుకోవటానికైనా వెనుదీయని పెద్దకాపు చిన్నకూతురు సరోజక నివురు గప్పిన నిప్పు! అందుకే నీతో మాట్లాడుతూ 'పుంగనూరుకువెళ్లిన రామ్మామ వచ్చేస్తే' అంది. అంటే తను గుట్టు బట్టబయలవుతుందని భయం! నా మాట నమ్ము గౌరీ! ఈ గంగాభవాని సాక్షిగా సరోజను నేను శరీరంతో కాదు, మనసుతోనైనా స్పృశించి ఎరుగను! పదేళ్ల పద్మే లేకపోతే నిన్నిప్పుడు దక్కించుకోలేక పోయేవాడిని...'' అన్నాడు రామన్న—గౌరిని దగ్గరకు తీసుకుంటూ.

అతని కౌగిల్లోని వెచ్చదనాన్ని చవిచూచింది గౌరి. ★